## క్లుప్తంగా

### ఆర్టీసీలో రక్తదానం



రక్తదానం చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

**చుంచుపల్లి:** కొత్తగూడెం ఆర్టీసీ డిపోలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ క్యాంపులో ఆర్టీసీ కార్మికులతో పాటు పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు, లయన్స్ క్లబ్ సభ్యులు వైద్యులు పాల్గొన్నారు.

### ఆపరేటర్ల బదిలీలకు బ్రేక్

**ఇల్లెందు:** ఇల్లెందు జేకే ఓసీ నుంచి పది మంది ఆపరేటర్ల బదిలీకి బ్రేక్ పడింది. సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే ఓసీ నుంచి పది మంది ఆపరేటర్లకు బదిలీ నోటీసులు జారీ చేయగా టీబీజీకేఎస్ అధికారుల దృష్టికి తీసుకుని రద్దు చేయించారని ఈ విషయాన్ని టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్ వెల్లడించారు. కాగా, సింగరేణిలో ఐరన్ చెక్ పోస్టులకు బదులుగా ప్రీ ఫ్యాబ్రికేటెడ్ గార్డు చెక్ పోస్టులు మంజూరయ్యాయని ఆయన తెలిపారు.

### సింగరేణి కార్మికుల ప్రతిభ



క్రీడాకారులను సన్మానిస్తున్న అధికారులు

**సింగరేణి(కొత్తగూడెం):** నేపాల్‌లో ఇటీవల నేపాల్ – ఇండియా జట్ల మధ్య జరిగిన టీ–20 క్రికెట్ పోటీల్లో భారత జట్టు తరఫున కొత్తగూడెం ఏరియా పీవీకే – 5షాఫ్ట్ కార్మికులు రాకేష్, సాయిధీరజ్ పాల్గొన్నారు. ఈ మేరకు జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన వీరిని మంగళవారం గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్ తదితరులు సన్మానించారు. అధికారులు, యూనియన్ల నాయకులు కూసన వీరభద్రయ్య, షాకీర్, శ్రీనివాస్, చిలక రాజయ్య, ఈశ్వరయ్య, జాకీర్, శ్రావణ్, రాజేశ్వరరావు, నాగార్జున, సూర్యతేజ, శ్రీనాథ్ పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

**పాల్వంచరూరల్:** గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం లక్ష్మీదేవిపల్లిల్లోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ టీచర్లను క్రమబద్ధీకరించాలని, బీసీ, ఎస్సీ, ఎస్టీ తదితర గురుకులాల్లో అమలు చేస్తున్న బోధన సమయాన్ని 9 గంటల నుంచి 9.30 గంటలకు పెంచాలని కోరారు. రాష్ట్ర ప్రిన్సిపాల్స్ సంఘం ఆర్గనైజేషన్స్ సెక్రటరీ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, సీఓఈ సిబ్బంది సంఘం అధ్యక్షుడు పాషా, పుల్లారెడ్డి, ఆర్.రామకృష్ణ, సరోజ, కవిత, ధనలక్ష్మి పాల్గొన్నారు.

### క్విజ్ పోటీలపై విస్తృత ప్రచారం



ప్రచార పత్రాలను ఆవిష్కరిస్తున్న సురేష్‌నాయక్

**కొత్తగూడెంరూరల్:** రాజీవ్ గాంధీ క్విజ్ పోటీలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు అజ్మీర సురేష్‌నాయక్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన కార్యక్రమం ద్వారా విద్యార్థుల మేధస్సును ప్రేరేపిస్తూ ప్రోత్సహించాలని ఈ క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు.

### రిటైర్డ్ ఉద్యోగులతో ముఖాముఖి

**ఇల్లెందు:** స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందిన ముగ్గురు ఉద్యోగులకు ఒకేసారి నగదు మంజూరు కోసం కుటుంబ సభ్యుల సమక్షంలో ముఖాముఖి నిర్వహించారు. మంగళవారం సింగరేణి ఇల్లెందు ఏరియా ఎస్‌ఓటూజీఎం మల్లారపు మల్లయ్య, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, అధికారులు రామచంద్ర, పూర్ణచందర్, శ్రీహరి, జి.రవి పాల్గొన్నారు.

# సుదూరంగా పోలీసుస్టేషన్!

- ఫిర్యాదులు చేయాలంటే ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ఔట్ పోస్టు ఏర్పాటు చేయాలని వినతి




కిన్నెరసానిలో కొనసాగుతున్న పాల్వంచ రూరల్ పోలీసుస్టేషన్

**పాల్వంచరూరల్:** ఏళ్ల తరబడి పాల్వంచ పట్టణంలో ఉన్న రూరల్ పోలీసుస్టేషన్‌ను ఏడేళ్ల క్రితం నక్సల్స్ ప్రభావిత ప్రాంతంలోని యానంబైల్ గ్రామపంచాయతీ కిన్నెరసాని గ్రామానికి 2016లో తరలించారు. దీంతో సోములగూడెం, తోగ్గూడెం, నాగారం, జగన్నాథపురం, దంతలబోరు, సూరారం, పాండురంగాపురం, గ్రామపంచాయతీల పరిధిలోని ప్రజలకు దూరమైంది. రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో 36 గ్రామపంచాయతీల పరిధిలో 43 గ్రామాలు ఉన్నాయి. పోలీసుస్టేషన్‌ను కిన్నెరసానికి తరలించడంతో పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ పరిధిలో ఉన్న పోలీసుస్టేషన్‌ను కిన్నెరసానికి తరలించడంతో ఫిర్యాదులు చేయడానికి వెళ్లాలంటే ఒక్కొక్కరికి రూ.200 పైన ఖర్చు అవుతోందని ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సిబ్బందికీ తప్పని ఇబ్బందులు...**

కిన్నెరసానిలో పోలీసుస్టేషన్‌ను ఏర్పాటు చేయడం వలన పోలీసు సిబ్బంది కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏదైనా కేసు నమోదు అయితే దానికి సంబంధించి జిరాక్స్‌లు కావాలంటే అక్కడ లేకపోవడంతో 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాల్వంచకు వచ్చి జిరాక్స్ తీసుకొని వెళ్లాల్సి వస్తోందని పోలీసు సిబ్బంది వాపోతున్నారు. అదేవిధంగా ఏడు గ్రామపంచాయతీల ప్రజలకు పోలీసుస్టేషన్‌కు వెళ్లాలంటే ముందుగా పాల్వంచ బస్టాండ్‌కు చేరుకుని అక్కడ నుంచి అంబేడ్కర్ సెంటర్‌కు వెళ్లాలి. అక్కడ నుంచి మరో ఆటోలో కిన్నెరసానికి వెళ్లాల్సి వస్తోందంటున్నారు. ఇలా ఒకరోజు సమయం పడుతోందని వాపోతున్నారు. ఏదైనా నేరం జరిగితే స్టేషన్ నుంచి సంఘటన స్థలానికి వెళ్లాలంటే కూడా ఎస్ఐతో పాటు సిబ్బందికి కూడా ఇబ్బందిగా ఉంది. ఇప్పటికైనా అధికారులు ప్రజల ఇబ్బందులు పరిగణంలోకి తీసుకోని రూరల్ పోలీసుస్టేషన్ పూర్వపు స్థానంలోకి మార్చాలని కోరుతున్నారు.

**తీవ్ర ఇబ్బంది పడుతున్నాం**



రూరల్ పోలీసుస్టేషన్‌ను కిన్నెరసానికి మార్చడం వలన దంతలబోరు పంచాయతీ ప్రజలకు 45 కిలోమీటర్ల దూరం అయింది. నాగారం, తోగ్గూడెం, జగన్నాథపురం, సోములగూడెం పంచాయతీ ప్రజలకు మరింత దూరమైంది. అంతదూరం వెళ్లి ఫిర్యాదు చేయాలంటే పేద ప్రజలకు భారంగా ఉంది.
– తెల్లం అలివేలు, సర్పంచ్, దంతలబోరు

**నిబంధనలు ఉంటాయి**



పాల్వంచ రూరల్ పోలీసుస్టేషన్‌ను కిన్నెరసానిలో ఏర్పాటు చేసిన తర్వాత పలు గ్రామపంచాయతీలకు దూరమైన మాట నిజమే. అయితే స్టేషన్ ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి ఫిర్యాదు చేయాల్సిందే తప్పదు. పోలీసుస్టేషన్ ఏర్పాటుకు పలు నిబంధనలు ఉంటాయి. ఔట్‌పోస్టు ప్రతిపాదనలు ప్రస్తుతానికి లేవు.
– వెంకటేష్, డీఎస్పీ, పాల్వంచ

**ఫిర్యాదులు తగ్గాయి**



పట్టణంలో ఉన్నప్పుడు ఫిర్యాదులు అధికంగా వచ్చేవి. స్టేషన్‌ను కిన్నెరసానికి మార్చు చేసిన తర్వాత తగ్గిపోయాయి. గతేడాది 250పైగా ఫిర్యాదులు వచ్చాయి. దంతలబోరు, బంద్రుగొండ, సంగం, నాగారం, తోగ్గూడెం, జగన్నాథపురం, రంగాపురం గ్రామాలు స్టేషన్ దూరంగా ఉన్నాయి.
– ఎం.శ్రీనివాస్, ఎస్ఐ, రూరల్ పోలీసుస్టేషన్

## క్షయ నిర్మూలనలో భాగస్వాములు కండి



ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ దినేష్

**టేకులపల్లి:** 2025 నాటికి దేశంలో క్షయ వ్యాధిని అంతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషికి ప్రజలందరూ సహకరించాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ గోళ్ల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ దినేష్‌తో కలిసి క్షేత్రస్థాయిలో క్షయ వ్యాధికి మందులు వాడుతున్న వారి ఇళ్లకు వెళ్లి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్షయ వ్యాధి నిర్ధారణ జరిగితే ఖరీదైన మందులు ఉచితంగా ఇవ్వడంతో పాటు పోషకాహార నిమిత్తం ప్రతినెలా రూ.500 అందజేయనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా వ్యాధి పూర్తిగా తగ్గేవరకు నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యురాలు ధరణి, క్షయ వ్యాధి ఇల్లెందు డివిజన్ సూపర్‌వైజర్ శంకర్, సర్వన్, నాగుబండి వెంకటేశ్వర్లు, స్వప్న, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ పేరుతో వెలసిన బోర్డు




ఏర్పాటు చేసిన బోర్డు

**సుజాతనగర్:** వేపలగడ్డ గ్రామ పంచాయతీ పేరుతో ఆ గ్రామంలో మంగళవారం ఓ బోర్డు వెలసింది. స్వాగతం.. సుస్వాగతం అంటూ ఓ వస్త్ర దుకాణం పేరుతో వెలసిన ఈ బోర్డు మండలంలో సంచలనంగా మారింది. వేపలగడ్డ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని స్థానికులు కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. సుమారు 1000 మంది ఓటర్లు ఉన్న ఈ గ్రామం నుంచి సుజాతనగర్ గ్రామ పంచాయతీకి ఏడాదికి సుమారు రూ.8 లక్షల ఆదాయం వస్తోంది. తమ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా చేస్తే ఈ నిధులు తమ గ్రామాభివృద్ధికే ఉపయోగపడతాయని స్థానికులు కోరుతున్నారు. 2018లో జరిగిన ఎన్నికల్లో తమ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీ చేయాలంటూ స్లిప్‌లను ఓటర్లు బ్యాలెట్ బ్యాక్సుల్లో వేశారు.

## సమస్యలు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

**సూపర్‌బజార్(కొత్తగూడెం):** అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కంచర్ల జమలయ్య మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సిబ్బందిని బీఎల్‌ఓ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో నిర్వహించిన బీఎల్‌ఓ విధులకు సంబంధించి బకాయి అలవెన్సులు చెల్లించాలని కోరారు. ఎన్నికల ప్రక్రియలో బీఎల్‌ఓ విధులు నిర్వహిస్తున్న టీచర్లకు ఏడాదికి రూ.6వేల గౌరవేతనం, ఇంటింటి సర్వేకు రూ.వెయ్యి, టీఏ, డీఏ బిల్లులతో పాటు పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటర్లకు స్లిప్‌లు పంపిణీ చేసినందుకు రూ.1,150 చెల్లించాలని నిబంధన ఉన్నప్పటికీ చెల్లించకుండా జాప్యం చేస్తున్నారని విమర్శించారు. బీఎల్‌లకు సంబంధిన గరుడ యాప్ వినియోగానికి అతీగతి లేకుండా పోయిందన్నారు. తక్షణమే బీఎల్ఓకు చెల్లించాల్సిన బకాయి వేతనాలు చెల్లించాలని, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు ఆటంకంగా మారిన బీఎల్‌ఓ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా నాయకులు గోనె మణి, రూప, ప్రమీల, సరోజ, ప్రతిభ, భాగ్య, మంగతాయి తదితరులు పాల్గొన్నారు.

## పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమతుల్యత చెట్ల ద్వారానే సాధ్యమవుతుంది. ఈ మేరకు టేకులపల్లి మండలం సూర్యాతండా పాఠశాల సమీపంలో అవెన్యూ ప్లాంటేషన్‌లో ఫారెస్టు అధికారులు మొక్కలు నాటారు. అవి ఏపుగా ఎదిగాయి. కానీ కొందరు పంట పొలాలకు అడ్డు వస్తున్నాయని చెట్లను నరికివేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పచ్చని చెట్ల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు. – టేకులపల్లి



చంద్రుతండా సమీపంలో నరికిన పచ్చని చెట్లు



సూర్యాతండా పాఠశాల సమీపంలో..



అవెన్యూ ప్లాంటేషన్‌లో..

### వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం



మాట్లాడుతున్న లక్కినేని సాయి

**పాల్వంచ:** రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు లక్కినేని సాయి అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. జూలై 2న ఖమ్మంలో బహిరంగ సభలో ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారని, అభిమానులు, కార్యకర్తలు, భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

### ఆర్థిక సాయం

**పాల్వంచ:** కొత్తగూడెం బాబూ క్యాంప్‌కు చెందిన యువకుడు రాహుల్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం పాల్వంచ వర్తక సంఘం కన్వీనర్ చలవాది ప్రకాశ్, రాజ్యలక్ష్మి దంపతులు మంగళవారం రూ.5 వేలు అందించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

### 3న స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికలు

**ఇల్లెందురూరల్:** హైదరాబాద్‌లోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్ 4, 5 తరగతులలో ప్రవేశాల కోసం జూలై 3న మండల స్థాయిలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ పిల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో ఎంపికలు ఉంటాయన్నారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఎంపికలకు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

### డ్రెయినేజీకి పైపులైన్ నిర్మాణం



పైపులైన్ నిర్మిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

**టేకులపల్లి:** టేకులపల్లి పంచాయతీ స్టేట్ బ్యాంకు వెనక బజారులో కొన్నేళ్లుగా మురుగు కంపు సమస్యతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. 'మురుగుకు పరిష్కారం ఎప్పుడో..?'అనే శీర్షికన సాక్షిలో ప్రత్యేక వార్తా కథనం ప్రచురితమైంది. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. దీనికి అధికారులు స్పందించారు. ఎంపీఓ గణేష్ ఆదేశాల మేరకు కార్యదర్శి కిరణ్‌కుమార్, సర్పంచ్ బోడ సరిత క్షేత్రస్థాయిలో పరిశీలించి మురుగు నిల్వ ఉండకుండా పైపులైన్ నిర్మింపజేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు ట్యాబ్‌లు పంపిణీ



ట్యాబ్ అందజేస్తున్న ఏఎంఓ నాగరాజుశేఖర్, ఎంఈఓ పిల్లి శ్రీనివాస్

**ఇల్లెందురూరల్:** పాఠశాలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసేందుకు వీలుగా ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం ట్యాబ్‌లు అందజేస్తోందని అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ నాగరాజుశేఖర్ తెలిపారు. మండల విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం ఆయన పలు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలకు సంబంధించిన సమాచారంతోపాటు విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, నిధుల వినియోగం తదితర వివరాలను ఇప్పటివరకు మండల విద్యావనరుల కేంద్రంలో ఆన్‌లైన్ చేయాల్సి వచ్చేదని తెలిపారు. దీనివల్ల కొంత జాప్యం చోటుచేసుకుంటోందని, సమాచారం చేరవేసేందుకు కొన్ని సందర్భాల్లో ప్రధానోపాధ్యాయులకు కార్యాలయానికి రావడం వల్ల సమయం వృథా అవుతోందన్నారు. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం ప్రతి పాఠశాలకు ట్యాబ్‌లు పంపిణీ చేయాలని నిర్ణయించిందన్నారు. విడతల వారీగా అన్ని పాఠశాలలకు త్వరలోనే ట్యాబ్‌ల పంపిణీ ప్రక్రియ పూర్తిచేస్తామన్నారు.

## కార్యదర్శిపై చర్యలు తీసుకోండి

**టేకులపల్లి:** పంచాయతీ కార్యదర్శి నిధులు దుర్వినియోగం చేశాడని, చర్యలు తీసుకోవాలని మద్రాస్‌తండా సర్పంచ్ మాళోతు రాజేందర్ నాయక్ అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టేకులపల్లి మండలం మద్రాస్ తండా గ్రామ పంచాయతీలో నిర్మించిన వైకుంఠధామం కొరకు సదరు కాంట్రాక్టర్‌కు 2021 మే నెలలో స్టేట్ ఫండ్స్ నుంచి రూ.2 లక్షలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఆ తరువాత పంచాయతీ రాజ్ డిపార్టుమెంట్ నుంచి 2023 ఏప్రిల్ 18న రూ.98,400 చెక్కు పంచాయతీకి వచ్చిందని పేర్కొన్నారు. మరుసటి రోజే ఈ చెక్కుని గ్రామ పంచాయతీ ఎస్ఎఫ్‌సీ ఖాతాలో జమ చేయాలని కార్యదర్శి భూకా మంగీలాల్‌కు ఇచ్చినట్లు చెప్పారు. కానీ సదరు కార్యదర్శి జమ చేయకుండా తన సొంత ఖాతాలో జమ చేసుకున్నాడని తెలిపారు. ఈ విషయం వారం రోజుల క్రితమే తెలిసిందని, ఇదేమిటని అడిగితే రేపు మాపు అంటూ జీపీకి రాకుండా ఎంపీడీఓ కార్యాలయానికే వచ్చి వెళ్తున్నాడని పేర్కొన్నారు. ఆ కార్యదర్శిని వెంటనే విధుల నుంచి సస్పెండ్ చేయాలని లేకపోతే న్యాయం కోసం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

## అక్రమ కట్టడాలపై చర్యలేవి?



నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

**కొత్తగూడెంఅర్బన్:** పట్టణ పరిధిలోని మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ప్యూన్ బస్తీలో అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి బహుళ అంతస్తు ఎదుట నిరసన తెలిపారు. మాట్లాడుతూ.. కొత్తగూడెం పట్టణంలో అనుమతులు లేకుండా బడాబాబులు, అధికార పార్టీ నాయకులు నిర్మాణాలు చేస్తున్నా మున్సిపల్ అధికారులు స్పందించకపోవడంలో ఆంతర్యమేమిటన్నారు. పేదలు చిన్నపాటి నిర్మాణాలు చేసుకుంటుంటే అత్యుత్సాహం ప్రదర్శించే అధికారులకు కార్యాలయానికి కూతవేటు దూరంలో ఇంత పెద్ద నిర్మాణం జరుగుతున్నా కనిపించడం లేదని ప్రశ్నించారు. గతంలో సదరు భవనం నిర్మాణం జరుగుతున్నప్పుడు అనుమతులు లేవని పనులు నిలిపి వేశారని, మళ్లీ ఇప్పుడు నిర్మాణం చేపడుతున్న అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్ తక్షణమే స్పందించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గంధం మల్లికార్జునరావు, సాయి, వంగా రవిశంకర్, తాటిపాముల హరికృష్ణ, జర్పుల కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## పీవైఎల్ మహాసభలకు తరలిరండి



పాల్వంచ: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

**పాల్వంచ:** జూలై 4, 5 తేదీల్లో ఇల్లెందులో జరగనున్న పీవైఎల్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు వలగాని సందీప్ పిలుపునిచ్చారు. మంగళవారం నటరాజ్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మహాసభల వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ.. దేశ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమైందని, దేశం మద్యం మత్తులో చిన్నాభిన్నం అవుతోందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో కేంద్రం విఫలమైందని విమర్శించారు. మహాసభలకు వక్తలుగా రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, ఎ.నర్సింహారెడ్డి పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో రమేశ్, సందీప్, సతీశ్, భాస్కర్, ఆదినారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**ఇల్లెందురూరల్:** జూలై 4,5 తేదీలలో ఇల్లెందులో నిర్వహిస్తున్న పీవైఎల్ రాష్ట్ర 8వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ నాయకులగూడెం గ్రామంలో మంగళవారం పీవైఎల్ నాయకులు ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. సోలెం నరేష్, పాయం రవి, వసంతరావు, ప్రవీణ్, రాంబాబు, మధుసూదన్, జగదీష్, సునీల్ పాల్గొన్నారు.

## రైల్వే అధికారులు స్పందించాలి

**కొత్తగూడెంఅర్బన్:** సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి కేవలం బొగ్గు రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు తప్ప, ప్రయాణికుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని కొవ్వూరు రైల్వేలైన్ సాధన కమిటీ కన్వీనర్ కొదమసింహ పాండురంగాచార్యులు విమర్శించారు. ఈ మేరకు రాష్ట్రపతి, రైల్వేమంత్రి, ప్రధానమంత్రికి, రైల్వే అధికారులకు మెయిల్ చేయడం జరిగిందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## పబ్లిక్ టాయిలెట్లు నిర్మించండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**టేకులపల్లి:** మండల కేంద్రంలో మరుగుదొడ్లు నిర్మించాలని సీపీఐ జిల్లా నేత గుగులోత్ రాంచందర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం టేకులపల్లి ఎంపీడీఓ కోట వీరబాబుకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. ప్రతి శనివారం మండల కేంద్రంలో వార సంత జరుగుతుంది, 36 గ్రామ పంచాయతీల నుంచి ప్రజలు సరుకులు కొనుగోలు చేసేందుకు టేకులపల్లికి వస్తుంటారు. కనీసం మరుగుదొడ్లు, తాగు నీరు సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గుగులోత్ శ్రీను, అయిత శ్రీరాములు, నరేష్, సతీష్, నరేందర్, బుజ్జి పాల్గొన్నారు.

**అటెన్షన్ ప్లీజ్**

## ప్రమాదకరంగా ఆటో ప్రయాణం



ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ఏజెన్సీ గ్రామాల్లోని ప్రజలు ప్రైవేట్ ఆటోలను ఆశ్రయించి ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. చంద్రాలగూడెం, బంజర, ఉల్వనూరు, మందేరకలపాడు, సత్యనారాయణపురం, రెడ్డిగూడెం, యానంబైల్, మల్లారం, కిన్నెరసాని గ్రామాల ప్రజలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. దీంతో వివిధ ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం చేస్తున్నారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఏజెన్సీలోని గిరిజన గ్రామాల ప్రజలకు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.
– పాల్వంచరూరల్

ప్రశ్నించాల్సిన అధికారి : బి.వెంకటేశ్వరరావు,
ఆర్టీసీ డిపో మేనేజర్, కొత్తగూడెం
సెల్‌నెంబర్ 9959225959